క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కంభంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కంభం: పాత నేరస్థులు సమాజంలో సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కంభం ఎస్సై నరసింహారావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత నేరస్థులపై ఎప్పుడూ పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. గతాన్ని మరిచిపోయి బాధ్యతగా నడుచుకోవాలని ఎటువంటి నేరాలకు పాల్పడకూడదన్నారు. పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కందులాపురం సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కంభం: సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వీరభద్రాచారి తెలిపారు. సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్ ను మంగళవారం ఎంపీడీవో తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్ కార్డుల్లో తప్పులున్నా, ఇతర మార్పులు చేర్పులు ఉంటే సచివాలయంలో నిర్వహించే కేంద్రాలకు వచ్చి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోష్ణలు పాల్గొన్నారు.

కలాం ట్రస్టు అవార్డు అందుకున్న మౌలాలీ



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం మౌలాలీ

మార్కాపురం టౌన్: పట్టణానికి చెందిన, తర్లుపాడు మండలం లింగారెడ్డికాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాలీ కలాం ట్రస్టు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేసిన వ్యక్తులకు తిరుపతికి చెందిన కలాం నేషనల్ ఫెలోషిప్ ట్రస్టు వారు ఈ అవార్డును అందిస్తారని, తనకు ఇస్రో ఓఎస్‌డీ కె.లక్ష్మణకుమార్ తనకు అందించారని తెలిపారు. సందర్భంగా కలాంను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు సైన్సు విషయాలపై దృష్టి పెట్టే విధంగా అవగాహన కలిస్తున్నానని మౌలాలీ తెలిపారు. ఈయన గతేడాది రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్నారు.


ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

కంభం: ద్విచక్ర వాహనం గేదెను ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం స్థానిక అనంతపురం-అమరావతి హైవేపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లికి చెందిన మోచర్ల చిన్నమల్లయ్య అనే వ్యక్తి తన ద్విచక్రవాహనం పై మార్కాపురం నుంచి కంభం వస్తుండగా కంభం సమీపంలో అమృతా రెస్టారెంట్ వద్ద ఎదురుగా గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చిన్నమల్లయ్య తలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ఆంజనేయులుకు మదర్ థెరిస్సా సేవా పురస్కారం



ఆంజనేయులును సన్మానిస్తున్న నిర్వాహకులు

పొదిలి: దివ్యాంగ రక్షక్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగ విభాగం అధ్యక్షుడు దేవళ్ల ఆంజనేయులుకు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం అవార్డు 2024 వరించింది. ఈ మేరకు హెల్త్ ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా సత్తెనపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులుకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు.



రాచర్లలోని రామాలయానికి వెళ్లే దారిలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు



పశువైద్యశాలకు వెళ్లే దారిలో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు



మార్కాపురం: పట్టణ శివారు భగత్‌సింగ్ కాలనీలో ఇలా..

- సిమెంట్ రోడ్లపై నిలిచిపోతున్న వర్షం నీరు
- సైడు కాలువలు లేక అవస్థలు
- కాలనీ వాసుల ఆందోళన

చినుకు పడితే చిత్తడే

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో అంతర్గత రోడ్లపై వర్షపు నీరు చేరి చెరువుల్లా తలపిస్తున్నాయి. అంతేకాక మరికొన్ని చోట్ల రోడ్లపై మట్టి వేయడంతో వర్షం కారణంగా ఆ రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ఆ రోడ్లపై పాదచారులు నడవాలన్నా, వాహదారులు ప్రయాణం చేయాలన్నా నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్లకు ఇరువైపులా ఉన్న సైడుకాలువలు పూడ్చి వేసి అక్రమ కట్టడాలు ఏర్పాటు చేసుకోవడంతో వర్షం నీరు బయటికి వెళ్లే మార్గం లేక సిమెంటు రోడ్డుపై నీరు నిల్వ ఉంటోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని సైడుకాలువలు తీసి వర్షపు నీటిని బయటికి పంపించి రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్లు..మురికి కూపాలు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని నల్లబండ బజారులో డ్రైనేజి కాలువలు లేకపోవడంతో సిమెంట్ రోడ్లు మురికి కాలువలను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లమీద పడిన వర్షపు నీరు వెళ్లేందుకు మార్గంలేక నీరు రోడ్ల మీదనే నిలిచిపోతోంది. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న పాములపల్లె రోడ్డు, నల్లబండ బజారు వీధిలోని సాయిసిద్ధార్థ్ స్కూల్ ప్రధాన రోడ్డులో, సెయింట్ పాల్స్ స్కూల్‌కు వెళ్లే రోడ్డులో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్డు మీదనే రోజుల తరబడి నీరు నిలిచిపోతున్నాయి. దీంతో స్కూల్‌కు వెళ్లేందుకు చిన్నపిల్లలు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంట్‌రోడ్డు కు సైడు కాలువలు నిర్మించకపోవడంపై రోడ్డు మీద పడిన నీరు అక్కడే ఉండిపోతోంది. సైడు కాలువలు లేని కారణంగా సిమెంట్ రోడ్లు కూడా ఎక్కువ కాలం ఉండకుండా గుంతలుపడే అవకాశాలున్నాయి. వాహనాలు రోడ్డు మీదుగా వెళ్లే సమయంలో రోడ్డు మార్జిన్ చివరిగా నడిచే వారి పై వర్షపు నీరు పడుతూ ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు అనేక సార్లు మురికి నీటిలో పడుతూ దుస్తులను పాడుచేసుకుని ఇంటికి వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత నగర పంచాయతీ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

భగత్‌సింగ్ కాలనీలోకి వరద నీరు

మార్కాపురం: గడిచిన వారం రోజులుగా మార్కాపురం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు చెరువు సప్లయి చానల్ కాలువ నుంచి నీరు పొంగి పట్టణ శివార్లలోని భగత్‌సింగ్ కాలనీలోకి వచ్చి చేరింది. ఇళ్ల మధ్యకు వరద నీరు రావడంతో మంగళవారం కాలనీ వాసులు తీవ్ర భయాందోళన చెందారు. చెరువు కాలువకు గండి పడిందనే వార్త వారిలో ఆందోళనకు గురిచేసింది. విషయం తెలిసిన వెంటనే ఇరిగేషన్ ఏఈ వినోద్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. కాలువ పొంగి నీరు కాలనీలోకి వచ్చిందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. మంగళవారం ఉదయం నిద్రలే చేసరికి కాలనీ శివారు ప్రాంతమంతా వరద నీరు చేరడంతో కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు. వరద నీటిలోనే మెయిన్ రోడ్డు మీదకు వచ్చారు. ఇరిగేషన్ అధికారులు మార్కాపురం చెరువు సప్లయి చానల్‌కు మరమ్మతులు చేపట్టి భవిష్యత్తులో కాలనీలోకి వరద నీరు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మార్కాపురంలో వర్షం

మంగళవారం సాయంత్రం కూడా మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అరగంట సేపు జోరు వర్షం కురిసింది. పత్తి, మిర్చి, కంది చేలల్లో వర్షం నీరు నిలవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మార్కాపురం: పట్టణ శివారు భగత్ సింగ్ కాలనీకి చేరిన వరద నీరు



సాయి సిద్దార్థ్ స్కూల్ వద్ద సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



సెయింట్ పాల్స్ స్కూల్ వద్ద మురికి కాలువగా దర్శనమిస్తున్న సీసీ రోడ్డు

మార్కాపురంలో ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

మార్కాపురం: ఎల్ఐసీ కార్పొరేషన్ అనుసరిస్తున్న విధానాలను మానుకోవాలని లియాఫీ ఏజెంట్ల అధ్యక్షుడు ఏవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మార్కాపురంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఐసీ కార్పొరేషన్ అక్టోబరు 1 నుంచి ఏజెంట్ల కమీషన్లు తగ్గిస్తోందని, ఈ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో లాగానే కమీషన్లు ఇవ్వాలన్నారు. పాలసీదారులపై జీఎస్టీని ఎత్తివేయాలని, బోనస్ పెంచాలని, గ్రామీణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉండే విధంగా కనీస బీమా మొత్తాన్ని లక్ష రూపాయల పాలసీ ఉంచాలని కోరారు. కార్యదర్శి ఎంసీహెచ్ అల్లూరయ్య మాట్లాడుతూ ఎల్ఐసీ యాజమాన్యం తమ వ్యతిరేక నిర్ణయాలను వెనక్కుతీసుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఇమాం సాహెబ్, ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, కేవీ సుబ్బారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.శంకరయ్య పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

దీపావళి దుకాణాలకు అనుమతి

- ఎస్‌వీకేపీ కళాశాలలో దీపావళి మందుల అమ్మకాలు
- వివరాలు వెల్లడించిన ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ

మార్కాపురం: పట్టణంలో దీపావళి మందులు అమ్మేందుకు 23 దుకాణాల యజమానులకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశామని ఫైర్ ఆఫీసరు రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీపావళి పండగను పురస్కరించుకుని పట్టణ శివార్లలోని ఎస్‌వీకేపీ కళాశాలలో మందులు అమ్మేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో మాత్రమే దీపావళి టపాసులు అమ్మాలని చెప్పారు. పట్టణంలో 2 గోడౌన్ పాయింట్లు ఉన్నట్లు చెప్పారు. జనావాసాల మధ్య ఎవరైనా టపాసులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌వీకేపీ కళాశాలలో ఏర్పాటు చేసే షాపుల మధ్య కనీసం 3 మీటర్లు దూరం ఉండాలని, ప్రతి షాపు యజమాని 200 లీటర్ల డ్రమ్ముల్లో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలని, దీనితో పాటు ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రేకులషెడ్డుతో షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల్లో 18 సంవత్సరాలలోపు వారిని అమ్మేందుకు అనుమతించకూడదన్నారు. ప్రతి షాపు యజమాని ఫైర్ ఎక్టిగుషన్ పరికరాన్ని కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు తెలిసే విధంగా డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. టపాకాయలు కాల్చేప్పుడు తల్లిదండ్రులు పిల్లల పక్కన కచ్చితంగా ఉండాలని, గ్రామాల్లో గడ్డివాములు, పూరిగుడిసెల వద్ద టపాసులు కాల్చవద్దని స్పష్టం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమకు వెంటనే సమాచారం చెప్పాలని రామకృష్ణ కోరారు.

మార్కాపురం ప్రాంతంలో 3,735 హెక్టార్లలో పంట నష్టం



నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసులు

- పత్తి రైతుకు అధిక నష్టం
- అధికారుల ప్రాథమిక అంచనా

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 9,342 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని (3,735 హెక్టార్లలో) మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ తెలిపారు. ఇందులో పత్తి 3,001 హెక్టార్లు, పొగాకు 347, సజ్జ 2.47, కొర్ర 8, మినుములు 295, అలసంద 83 హెక్టార్లలో ప్రాథమికంగా పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తామని చెప్పారు. ముఖ్యంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవి పత్తి సాగు చేసిన రైతులకు నష్టం ఎక్కువగా ఉంటోంది. కాయలు వచ్చి పత్తి దిగుబడి వచ్చే సమయంలో వర్షాలకు, గాలులకు పత్తి మొక్కలు పడిపోవడంతో పాటు తీవ్ర వర్షానికి కాయలు కుళ్లిపోయాయి. దీంతో దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లోనే నష్టపరిహారాన్ని తమకు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

మార్కాపురం రూరల్: వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను మార్కాపురం ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని జమ్మనపల్లి, కొత్తపల్లి పంట పొలాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. పంట పొలాల్లో నీరు నిలిస్తే వెంటనే నీటిని తొలగించి పత్తి, మిరప పొలాల్లో యూరియా 50 కేజీలు, పొటాషియం 30 కేజీలు వేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంట పొలాలకు సంబంధించిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఏఓ తెలిపారు. వీఏఎస్ అశ్వనీ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, జమ్మనపల్లి వీఎస్‌ఏ సంధ్య పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచర్ల సమీపంలో పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. వారి వద్ద రూ.2020 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యేల ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

పొదిలి రూరల్: పొదిలి పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కంకణాల వెంకట రమేష్ కుమారుడి వివాహ రిసెప్షన్ సోమవారం రాత్రి స్థానిక వాసవీ కళ్యాణ సదన్‌లో వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి హాజరై నూతన వధూవరులు అనిరుద్, కామాక్షి ప్రియాంకలను ఆశీర్వదించారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, యక్కలి శేషగిరి, జి.శ్రీనివాసులు, మెట్టు వెంకటరెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన వైద్యం అందించాలి

కొమరోలు: ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించాలని ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. మండల కేంద్రమైన కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని, ప్రజలకు రోగాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చైతన్యదీపక్, డాక్టర్ రజియా సుల్తానా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: గ్రామాల్లో పారిశుధ్యం లోపించి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల విద్యాశాఖాధికారులు, హాస్టల్ వార్డెన్లు, కేజీబీవీ ప్రిన్సిపాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లుతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎంపీడీఓ పలు అంశాలపై చర్చించారు.

పొదిలి రూరల్: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పెషలాఫీసర్ పి. విద్యాసాగర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శానిటేషన్‌పై ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.శోభన్‌బాబు, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ఏఈలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బేస్తవారిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రంగనాయకులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశహాలులో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ చేయించాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు మహబూబ్ వలి, వికాస్, ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి, సీడీపీఓ నీలోఫర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాయక్, ఈఓపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఎన్జీవో డివిజన్ కార్యదర్శి బి.శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ కార్మికుల ఉపాధి ఊడగొట్టే చర్యలు మానుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. 25 సంవత్సరాలుగా మార్కాపురం మున్సిపాలిటీలో ప్రజల కోసం అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు అందే నాసరయ్య, ఎంపీజే రాష్ట్ర నాయకుడు రజాక్, మాలమహానాడు నాయకుడు నూతలపాటి దేవరాజ్, కేవీపీ నాయకులు రాజు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకుడు రాంబాబు, పట్టణ పౌర సంఘాల సమైక్య నాయకులు డి.సోమయ్య, ఏఐటీయూసీ నాయకులు ఖాసిం, జేవీవీ నాయకులు వై.రవికుమార్, డివైఎఫ్ఐ నాయకులు విక్టర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు



భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రాచర్ల: భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో రీ సర్వే పూర్తి చేసుకున్న గుడిమెట్ట సచివాలయంలో మంగళవారం గ్రామ సభలను నిర్వహించారు. అనంతరం రీ సర్వేలో భూ సమస్యలపై 24 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డికాశిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జి.భారతిభాయ్ పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలు

కంభం: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రీ సర్వేకి సంబంధించి రైతుల సమస్యలు పరిష్కరించడం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న జంగంగుంట్లలో, 24న నడింపల్లిలో, 26న కాగితాల గూడెంలో, 29న కందులాపురంలో గ్రామ సభలు జరుగుతాయన్నారు.

భూముల రీసర్వేపై గ్రామసభ

కొనకనమిట్ల: గ్రామసభలు నిర్వహించి భూములు రీసర్వేపై తప్పులు జరిగితే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. రీ సర్వే భూముల పరిష్కార గ్రామసభలను మంగళవారం మండలంలోని నాగంపల్లి, వింజవర్తిపాడు గ్రామాల్లో నిర్వహించారు. గ్రామసభల్లో సర్పంచ్ కీసరి వెంకటనారాయణ, ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తాతిరెడ్డి పెదవెంకటరెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కంభం: స్థానిక కందులాపురం పంచాయతీ పరిధిలోని వాల్మీకి నగర్‌లో మంగళవారం ఓ బాలుడిపై కుక్కదాడి చేయడంతో గాయపడ్డాడు. గాయపడిన బాలుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు.